కంటి వెలుగును విజయవంతం చేయాలి

- ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత ఆర్డీవో శ్రీనివాసులు
- పలు మండలాల్లో అవగాహన సదస్సులు


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి వెలుగు రెండో విడత ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందన్నారు. పట్టణంలోని 36వార్డుల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వైస్ చైర్మన్ షేక్‌మున్ను, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రమోహన్, మెడికల్ ఆఫీసర్ అయేషా, కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: రుద్రూర్, చందూర్ మండల కేంద్రాల్లో శుక్రవారం కంటి వెలుగు రెండో విడతపై సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆయా మండలాల వైద్యాధికారులు విజయ్ కుమార్, ఆయేషా సిద్దిఖా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలకు వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీవోలు బాలగంగాధర్, సీలావతి, అధికారులు సాయిలు, తారాచందర్, దశాగౌడ్ పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కంటి వెలుగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ లోలపు రజని, ఎంపీడీవో శంకర్, ఆస్పత్రి వైద్యుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్య శిబిరాల వివరాలను వివరించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



బాల్కొండలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు.. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో..

కోటగిరి మండలంలో..

కోటగిరి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైస్ ఎంపీపీ మర్కెలి గంగాధర్ పటేల్ కంటివెలుగుపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రావు, హెల్త్ సూపర్ వైజర్లు కృష్ణవేణి, జ్యోతి పాల్గొన్నారు.

బాల్కొండ మండలంలో..

బాల్కొండ: బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో కిసాన్‌నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్ కంటి వెలుగుపై ఆశవర్కర్లకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీపీ లావణ్య, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. మెండోరా మండలంలోని పోచంపాడ్ పీహెచ్‌సీలో కంటి వెలుగు నిర్వహణ కోసం వసతులను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు.

భీమ్‌గల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కంటి వెలుగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలన్నారు.


రెంజల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ రజని


రుద్రూర్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి ఆయేషా సిద్దిఖా..


భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ మహేష్

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- రుద్రూర్‌లో 'డబుల్' నిర్మాణాలకు భూమిపూజ


మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని, ఇందుకోసం పలు పలు పథకాలు అమలు చేస్తున్నారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో శుక్రవారం 50 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాని ఆయన భూమి పూజ చేశారు. అంగడి బజార్‌లో బోధన్ ఏఎంసీ చైర్మెన్ వెంకటేశ్వర్రావ్ దేశాయ్ తల్లి చంద్రవతి దేశాయ్ జ్ఞాపకార్థం బాల వికాస సహకారంతో ఏర్పాటు చేసిన మినిరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు బాల వికాస లాంటి స్వచ్ఛంద సంస్థలు మంచి నీరు అందించడానికి కృషి చేస్తున్నాయని కొనియాడారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కులాల వారీగా కమ్యూనిటి హాళ్లకు, మండలంలోని ప్రధాన రోడ్లకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుజాతనాగేందర్, జెడ్పీటీసీ న రోజి గంగారాం, ఆర్డీవో రాజేశ్వర్, హౌసింగ్ ఏఈ నాగేశ్వర్రావ్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, బోధన్ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్రావ్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల రోడ్లకు మహర్దశ

కోటగిరి: బాన్సువాడ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో రోడ్లకు మహర్దశ వచ్చిందని, ఆయా గ్రామాల్లోని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చడానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో ఇటీవల ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.165కోట్ల నిధులు మంజూరైనట్లు నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. పోతంగల్ మండలం హెగ్డోలి జీపీ పరిధిలోని శేషాద్రి ఫారంలో శుక్రవారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన వీధిరోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చడానికి నియోజకవర్గ అభివృద్ధి నిధులు సుమారు రూ.3 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. నాయకులు వల్లేపల్లి శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, ఏఎంసీ వైస్ చైర్మన్ కల్లూర్ రాంరెడ్డి, ఎంపీటీసీలు ఉమా రాంబాబు, దోమలెడ్గి విఠల్, కొల్లూర్ సర్పంచ్ సంపత్ ఉన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పోచారం సురేందర్ రెడ్డి

ముగ్గులు మన సంస్కృతిలో భాగం


ఆర్మూర్‌లో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఆర్మూర్‌టౌన్: ముగ్గులు మన సంస్కృతిలో భాగమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణ మందిరంలో శుక్రవారం క్షత్రీయ యువజన సమాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ముగ్గులు ఇళ్ల ముందు వేయడం పూర్వీకులు పెట్టిన సంప్రదాయమన్నారు. అనంతరం న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు. ఇటీవల సీఏ పరీక్షల్లో ఉత్తీర్ణులైన యోగేష్, శ్రీనివాస్‌ను సత్కారించారు. క్షత్రీయ సమాజ్ కార్యదర్శి బారడ్‌గంగామోహన్, కౌన్సిలర్లు రమేష్, ఖాందేష్ సంగీత, జనార్దన్‌రాజు, నాయకులు పండిత్ పవన్, ఖాందేష్ శ్రీనివాస్, ప్రశాంత్, దోండి అనిల్, కర్తన్ విశాల్ పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన



వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో శుక్రవారం వరి పంటపొలాలను ఏవో నర్సయ్య, స్థానిక రైతులు పరిశీలించారు.వరిలో జింక్‌లోపం, ఉల్లికోడు, తాటాకు తెగులు, మొగిపురుగు ఏర్పడిందని గుర్తించారు. జింక్ లోపం నివారణకు ఎకరానికి చిలేటెడ్ జింక్ 1 కిలో పిచికారి చేయాలని ఏవో రైతులకు సూచించారు. ఉల్లికోడు, తాటాకు తెగులు, మొగి పురుగు నివారణకు పిప్రోనిల్ 0.6 గుళికలు 4 కిలోలు ఎకరానికి చల్లుకోవాలన్నారు. లేదా కార్బన్ హైడ్రా క్లోరైడ్ గుళికలు ఎకరానికి 1 కిలో పిచికారి చేయాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్, ఏఈవో శాబిర్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

మోర్తాడ్: ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని, రైతులు సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టిసారించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కాలువ మల్లయ్య సూచించారు. ఏర్గట్ల రైతు వేదిక భవనంలో శుక్రవారం రైతులకు ఆయన ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. నూనెల దిగుమతులు తగ్గాలంటే ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచడం ఒక్కటే మార్గం అన్నారు. ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, ఎంపీడీవో రాజేశం, ఏవో అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని మట్టయ్య ఫారం గ్రామంలో శుక్రవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు ఏవో సురేష్‌గౌడ్ అవగాహన కల్పించారు. వరి వైపు మొగ్గు చూపకుండా ఆయిల్‌పాం పంటను సాగు చేయాలని సూచించారు. ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ రాము, ఉద్యానవన శాఖ అధికారి వహీద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఏర్గట్లలో మాట్లాడుతున్న ఏడీఏ మల్లయ్య

పసుపు రైతులపై నిర్లక్ష్యం తగదు

కమ్మర్‌పల్లి: పసుపు రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరికాదని మండల రైతు ఐక్య వేదిక ప్రతినిధులు ధ్వజమెత్తారు. మండలంలోని హాసాకొత్తూర్‌లో శుక్రవారం రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పడిగెల ప్రవీణ్‌రెడ్డి, కొమ్ముల సంతోష్‌రెడ్డి, గోపిడి లింగారెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం పసుపు పంట తవ్వకం, ఉడకబెట్టడం తదితర పనులు ప్రారంభమయ్యాయని, కానీ మార్కెట్‌లో మాత్రం గిట్టుబాటు ధర లేక సాగు ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్ రెడ్డి పసుపు రైతుల గోస చూసి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి లేఖ రాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా పసుపు రైతులకు బోనస్ ఇప్పించాలని కోరారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తీసుకువస్తానని హామీనిచ్చి ఇంతవరకు తీసుకురాలేకపోయారన్నారు. నాయకులు ఏనుగు అశోక్, ఏలేటి సంతోష్, గంగారాం, లింగన్న, గడ్డం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు ఐక్య వేదిక ప్రతినిధులు

బాధిత కుటుంబాలకు చేయూత



మాక్లూర్: బీజేపీ బూత్‌కమిటీ అధ్యక్షుడు పోశెట్టి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఎంపీ అర్వింద్ తన కార్యాలయంలో శుక్రవారం ధర్మపురి ఫౌండేషన్ సంక్షేమ నిధి నుంచి రూ.1లక్ష చెక్కును అందజేశారు. బీజేపీ నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, గంగోనే సంతోష్, చిన్నాపూర్ వినోద్, శివలాల్‌లు ఉన్నారు.

నందిపేట్(ఆర్మూర్): నందిపేటకు చెందిన బీజేపీ బూత్‌స్థాయి సభ్యుడు ఉమ్మెడ అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ధర్మపురి ఫౌండేషన్ నుంచి రూ. లక్ష చెక్కును ఎంపీ ధర్మపురి అర్వింద్ అందజేశారు.

వివాహిత అదృశ్యం

ఆర్మూర్‌టౌన్: నిర్మల్ జిల్లా జామ్ గ్రామానికి చెందిన రుద్రారం చందన(23) కనిపించడం లేదని ఆమె తల్లి రుద్రారం లత శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. జామ్ గ్రామానికి చెందిన చందన ఈ నెల 10న దివ్యాంగ పింఛను తీసుకోవడానికి ఆర్మూర్‌లోని తల్లిగారి ఇంటికి వచ్చింది. అనంతరం అత్తగారి ఇంటికి వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి వెళ్లింది. కాగా చందన జామ్ గ్రామానికి చేరుకోకపోవడంతో ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి లత ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను శుక్రవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర నాయకులు భూమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. పంపిణీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అర్హులైన పేదలకు ఇళ్లను అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఓమయ్య, రాజన్న, రాజేశ్వర్, రాజారెడ్డి, రఘురాం, రంజిత్ పాల్గొన్నారు.

చైనా మాంజా స్వాధీనం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న సాయి కృష్ణ ఏజెన్సీ దుకాణంపై దాడులు చేసి, విక్రయించడానికి సిద్ధంగా ఉన్న చైనా మాంజా డబ్బాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాము శుక్రవారం తెలిపారు. చైనా మాంజాను ఎవరైన విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సౌర విద్యుత్ ఏర్పాటుకు రుణాలు

వేల్పూర్: మహిళా సంఘాల సభ్యులు సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు స్త్రీనిధి, ఐకేపీ అధికారులు వెల్లడించారు. వేల్పూర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం వేల్పూర్, భీమ్‌గల్ మండలాల మహిళా సంఘాల సభ్యులకు సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ఖర్చుల భారం పెరిగిపోతున్నందున సొంతంగా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకొని, విద్యుత్ చార్జీలను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. పెట్టుబడి ఐదేళ్లతో తీరిపోతుందని, సోలార్ ప్యానల్ వారంటీ 25 సంవత్సరాలు కాగా, సోలార్ యూనిట్ వారంటీ 5 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఏపీఎం కిరణ్‌కుమార్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు నాగధర్‌రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ నితీష్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు హాసీమ, స్త్రీనిధి మేనేజర్లు రాజారావు మురళి, రమేశ్, రేణుక, సురేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సేంద్రియ సాగుతో ప్రకృతి సంరక్షణ


ఊట్‌పల్లిలో డ్రోన్‌లతో పురుగు మందుల స్ప్రేపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బోధన్‌రూరల్(బోధన్): సేంద్రియ వ్యవసాయ సాగుతో ప్రకృతిని సంరక్షించడంతో పాటు అనేక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ అన్నారు. మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల తయారి, సేంద్రియ వ్యవసాయ విధానాలు, డ్రోన్‌ల ద్వార పురుగు మందులను స్ప్రే వంటి అంశాలపై రైతులు, మహిళలకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త సురేష్, డీఆర్‌డీవో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాచయ్య మాట్లాడుతూ.. వానపాముల ఎరువు తయారీ, వాటి ఉపయోగాలు, పెరటి తోటల పెంపకం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ గుప్తా, ఏపీఎం గంగారాం, కార్యదర్శి సుభాష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని లయన్స్ భవనంలో క్లబ్ సభ్యులు మెల్విన్ జోన్స్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు చెన్న రవికుమార్, జోనల్ చైర్మన్ పుప్పాల శివరాజ్, అంబల్ల తిరుపతి పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లుల అందజేత



రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు మంజూరైన బిల్లులను శుక్రవారం సర్పంచ్ కర్లం సాయరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో శుక్రవారం నిర్మల్ బీవోటీ అధికారులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా వర్క్‌షాపులు, వాక్‌థాన్‌లు నిర్వహించారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సిబ్బంది స్వామి, మల్లారెడ్డి, కుమార్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



వేల్పూర్: కోటగిరిలో ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బాల్కొండ నియోజవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వేల్పూర్‌లోని మాదిగ సంఘంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, లేకుంటే సహించేది లేదని పేర్కొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం వాలీబాల్ పోటీలను మాజీ సర్పంచ్ తలారీ నర్సయ్య ప్రారంభించారు. యువశక్తి ఆధ్వర్యంలో ప్రారంభమైన పోటీల్లో ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో క్యారంబోర్డ్ పోటీలు..



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో స్థానిక క్యారంబోర్డ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్యారంబోర్డు పోటీలను శుక్రవారం ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఏఎస్సై చిన్న గంగారాం, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎన్‌డీఎస్ఎల్ విశ్రాంత కార్మికుడి మృతి



బోధన్: పట్టణంలోని రాకాసీపేట్‌లోగల నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) విశ్రాంత కార్మికుడు, సీఐటీయూ క్రియాశీల నాయకుడు ఓటర్‌కార్ సాయిలు (50) శుక్రవారం సాయంత్రం గుండెపోటు హఠాన్మరణం పొందారు. సాయిలు మృతిపై సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు బాస్కర్, జిల్లా ప్రతినిధులు శంకర్‌గౌడ్,కుమార స్వామి, యేశాల గంగాధర్, ఎన్‌డీఎస్‌ఎల్ మజ్దూర్ సభ యూనియన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. శనివారం రాకాసీపేట్ ప్రాంతంలోని స్వగృహం వద్ద సాయిలు అంత్యక్రియ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

సంక్షిప్తం

బీమా చెక్కు అందజేత



మాక్లూర్: మండలంలోని గుంజ్లీ గ్రామానికి చెందిన నవాతే శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో బాధిత కుటుంబానికి శుక్రవారం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అలాగే రైతుబీమా పథకం కింద రూ. 5లక్షల చెక్కును అందజేశారు. సర్పంచ్ గుండారం శేఖర్, గోపు రంజిత్, పి శివరామకృష్ణగౌడ్, రాజులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో శుక్రవారం క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, క్షత్రియ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాందేష్ శ్రీనివాస్, అల్జాపూర్ నందకిశోర్, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలోని తాలూక హరిజన సంఘం ఆవరణలో నూతనంగా యూత్ బిల్డింగ్ నిర్మాణానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ. 4లక్షలు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడంలో కృషి చేసిన దిశ కమిటీ సభ్యులను శుక్రవారం సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

మోస్రాలో కంటి వైద్యశిబిరం



రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు 90మందిని పరీక్షించి 15మందికి మోతిబిందు సమస్య ఉన్నట్లుగా నిర్ధారించారు. శిబిరంలో డిస్ట్రిక్ట్ సెక్రటరీ విజయలక్ష్మి పండ్ల రసాలు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు విఠల్,త్రినాథ్, అరుణ్, సతీష్, లక్ష్మీనర్సింహ పాల్గొన్నారు.